


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజన

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:19 ఎడిటర్: రాపోలు లింగస్వామి 19 -09 -2026 శనివారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

**సిద్ధిపేటలో ఆక్రమించుకున్న భూముల్లో**

## పేదలకు ఇళ్లు నిర్మిస్తాం

**: పొంగులేటి**

**నూనూగు మీసాల కెటిఆర్ కొడుకుకి 40 ఎకరాల భూమి ఎలా వచ్చింది.**
**అసైన్డ్ భూముల పట్టాదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టం**
**కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సర్వే అనంతరం వాస్తవాలు వెల్లడిస్తాం**
**రంగనాయకసాగర్ భూముల వ్యవహారంపైనా రికార్డుల ఆధారంగా విచారణ**
**తప్పు ఎవరు చేసినా చట్ట ప్రకారం చర్యలు.. అధికారుల పొరపాట్లకు కూడా మినహాయింపు లేదు**
**కేటీఆర్ చెప్పినట్లుగా కేసీఆర్‌కు చిన్నప్పుడే 2ఎకరాలలో ఇల్లుంటే ఎందుకు 2004 అఫిడవిట్‌లో చేర్చలేదు.**
**మీడియా చిట్‌చాట్ లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్: రాష్ట్రంలో భూములపై నెలకొన్న వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలంటే రికార్డులు, భౌతిక పరిస్థితి రెండింటినీ సమన్వయం చేయాల్సి ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రికార్డులో ఉన్న భూమి ఎంత? డాక్యుమెంట్లలో ఎంత? భౌతికంగా ఎవరి పొజిషన్‌లో ఎంత ఉంది? ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? అన్నది సమగ్ర సర్వే ద్వారా తేలుస్తాం. వాస్తవాలు బయటకు వచ్చిన తర్వాత చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , తాను మాట్లాడే ప్రతి అంశానికి డాక్యుమెంట్లు, అధికారిక రికార్డులు ఉన్నాయని, సర్వే పూర్తయిన తర్వాత సాంకేతిక ఆధారాలతో వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు. భూముల విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టదని, అయితే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రైవేట్ పట్టా భూములు, భౌతిక స్వాధీనం, రెవెన్యూ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లలో చూపిన ఆస్తుల మధ్య తేడాలు ఉంటే వాటిని రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిందేనని అన్నారు

కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సమగ్ర సర్వే

కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఉన్న భూముల విషయంలో స్థానికుల నుంచి వచ్చిన సమాచారాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన కూడా స్థానికుల నుంచి వచ్చిన సమాచారంపై ఆధారపడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల్లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు సర్వేలో తేలితే, చట్టప్రకారం ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అర్హులైన పేదలకు, ముఖ్యంగా దళితులకు ఉపయోగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. 2004 అఫిడవిట్‌లో భూములు లేవని చెప్పి.. ఇప్పుడు వందలఎకరాలు ఎలా? అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబ భూములపై జరుగుతున్న చర్చలో ఎన్నికల అఫిడవిట్లలో నమోదైన వివరాలు కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. 2004 లోకసభ ఎన్నికల అఫిడవిట్‌లో కెసిఆర్ తన పేరున వ్యవసాయ భూమి లేదని పేర్కొన్నారు. అలాంటప్పుడు తర్వాత కాలంలో విస్తారమైన భూములు ఎలా వచ్చాయి? పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వాములమని చెబుతున్నప్పుడు, ఆ భూముల వివరాలు సంబంధిత ఎన్నికల 3వ పేజీలో ..

## నా జీవితం తెరిచిన పుస్తకం..

**ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల వివరాలు స్పష్టంగా చెప్పిన**

**: హరీశ్ రావు**



నా జీవితం తెరిచిన పుస్తకం అన్ని ఎన్నికల అఫిడవిట్లలో నా భూములు, ఆస్తుల వివరాలు సుస్పష్టంగా చెప్పిన అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బైండ్ల సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ వాళ్లు సిద్దిపేటకు వస్తున్నరట. నా భూములు చూసి పోతరట. వందల మంది పోలీసులు, బుల్లెట్ ప్రూఫ్ బండ్లు, రోప్ పార్టీలు ఎందుకు? డ్రోన్లు పెట్టి ఫొటోలు తీయడం ఎందుకు?

నేను ఇక్కడే ఉన్న నాకు చెబితే వారికి అన్ని ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. మంచిగ కడుపు నిండ అన్నం తినిపించి దగ్గరుండి కంటి నిండా తోట అన్నీ చూపిస్తానని పేర్కొన్నారు. కాకుంటే ఉన్నది ఉన్నట్లు చెప్పండి. అబద్ధాలు చెప్పకండని హితవు పలికారు. అన్ని ఎన్నికల అఫిడవిట్లలో నా భూములు, ఆస్తుల వివరాలు సుస్పష్టంగా చెప్పిన. సర్వే నెంబర్లతో సహా భూముల వివరాలు ఇచ్చినం. రామంచల 13 ఎకరాలు ఉంటే లేని పోనీవి చెప్పుతున్నారు. నేను దాచింది ఏముంది. నువ్వు కొత్తగా బయట పెట్టేది ఏముంది. మీ లాగా నేను కబ్జాలు పెట్టలేదు, ప్రజల సొమ్ము దోచుకోలేదని స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రజలు నా పని చూసి ఏడు సార్లు గెలిపించారు. నన్ను దీవించారు. మీరు అంత భయపడాల్సిన అవసరం లేదు. మా సిద్దిపేట అంటేనే ప్రేమ, ఆప్యాయతకు, ఆతిథ్యానికి చిరునామా..సిద్దిపేటకు ఎవరు వచ్చినా కడుపునిండా అన్నం పెడతాం ప్రేమగా మాట్లాడుదుతామన్నారు. అంత మంది పోలీసులు పెట్టుకొని భయపడుకుంటూ రావాల్సిన అవసరం మీకు లేదని తెలిపారు.

## తెలంగాణ హైకోర్టు తీర్పు..

**దానం నాగేందర్‌పై అనర్హత వేటు**



హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. దానం విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అతనిపై అనర్హత వేటు వేస్తూ సిజె ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. దానంపై అనర్హత వేటు వేయాలంటూ బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో పాటు బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. దానం నాగేందర్ బిఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారని, 2024లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. 10వ షెడ్యూల్ ప్రకారం వ్యవహరించకుండా, నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని హైకోర్టును కోరారు. పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు పలు ఆధారాలు సమర్పించామని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా.. సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ మార్చి 11న ఉత్తర్వులిచ్చిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన సిజె ధర్మాసనం.. ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఇసికి సమాచారం ఇచ్చింది.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



నడిగూడెం, సెప్టెంబర్ 18: విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి విజయ నాయక్ కోరారు. శుక్రవారం కళాశాలలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెరగాలని, కళాశాలకు క్రమం తప్పకుండా హాజరైన వారే ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి .కళాశాల అధ్యాపకులు ,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

**22 ఏ నుంచి రేవంత్ రెడ్డి తప్పించుకోలేడు..**

## ఆయనకు శిక్ష పడాల్సిందే

సూర్యాపేట : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని డ్రామాలు చేసినా 22 ఏ పై చేసిన తప్పుల నుంచి తప్పించుకోలేడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇతరుల పై ఆరోపణలు చేసి తప్పించుకోవాలని తెలివితక్కువ వేషాలు వేస్తున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రికి ప్రజల నుంచి శిక్ష తప్పదని హెచ్చరించారు. చేతనైతే బీఆర్ఎస్ సభ్యులను శాసనసభకు అనుమతించి చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. సభ నుంచి బయటకు పంపి బ్యాట్స్‌మెన్ లేకుండా కాంగ్రెస్ బౌలింగ్ చేస్తుందని విమర్శించారు. తమకు అవకాశం ఇస్తే అసెంబ్లీలో సిక్సుల మోత మోగుతుందని అన్నారు. ఎర్రవల్లి భూముల సర్వేలో ప్రభుత్వానికి దళితుల నుంచి చుక్కెదురైందని వెల్లడించారు. ఇప్పటి వరకు నోటీసులు ఇవ్వకుండా సర్వే పేరిట ఫాం హౌస్ చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. డ్రామా పొడిగింపు కోసమే ఎమ్మెల్యేలు , ఎంపీలను పంపుతామం టున్నారని ఆయన అన్నారు. కాలయాపన చేయడానికే హై లెవెల్ కమిటీ ని ప్రకటించారని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో పేరిట పేరిట డ్రామాలాడి ఆంధ్రాకు నీటిని పంపుతున్నారని ఆరోపించారు. రైతులు ఇప్పటికైనా మేల్కోవాలని , నమ్మి ఓటేసినందుకు గొయ్యి తొవ్వుతున్నారని అర్థం చేసుకుని రైతులు తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.






జ్యోతి ప్రభంజనం



# సంపాదకీయం

## తెలంగాణ విమోచనోద్యమం.. పాలకులకు ఒక గుణపాఠం

తెలంగాణను అనేకమంది–ాజులు పరిపాలించారు. చివరగా పాలించినవారు అసఫ్‌జాహీ ంశీయులు. ఇందులో చివరి నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911 నుంచి 1948 సెప్టెంబర్ 17 వరకు పరిపాలించాడు. ఈయన కాలంలోనే హైదరాబాద్‌తో (తెలంగాణ?8 జిల్లాలు, మహారాష్ట్ర?5 జిల్లాలు, కర్ణాటక?3 జిల్లాలు) పాటు, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ స్వాతంత్ర్యోద్యమం ఊపందుకోవడంతో 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. దేశంలోని 560 సంస్థానాలలో జమ్మూ కశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాల వారు భారత ప్రభుత్వంలో విలీనం కావడానికి ఇష్టపడలేదు. ఆనాడు దేశమంతా వందేమాతరం నినాదాలతో మువ్వన్నెల జెండాను ఎగరేస్తూ, ఆనందంగా భరతమాతను అర్చిస్తూ ఉంటే తెలంగాణలో మాత్రం రాక్షసి మూకలు రాజ్యం చేస్తున్నాయి. నిజాం నవాబు ఇక్కడి మట్టిలోని స్వాతంత్ర్య కాంక్షను చంపేసి, ఉన్మాద పాలన కొనసాగించాడు. పత్రికలు, సంస్కృతి, సమావేశాలు, గ్రంథాలయాలపై ఆంక్షలు విధించాడు. అది మెల్లమెల్లగా ప్రజల హృదయాలను తాకి పోరాటంగా మారింది. ఈ పోరాటంలో మతోన్మాదపు కత్తులకు ఎందరో వీరులు బలైపోయారు. సామాజిక ఉద్యమ సంస్థలు, మేధావులు, రాజకీయవేత్తలు, పత్రికా సంపాదకులు, సామాజిక కార్యకర్తలు.. నిజాంకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేశారు. వారికి మద్దతుగా హైదరాబాద్ పైకి నాటి హోంమంత్రి, ఉపప్రధాని అయిన సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ సైన్యాన్ని పంపించారు. నిజాం పాలనలో 500 జాగీర్లు, 14 సంస్థానాలుండేవి. వీరందరూ నిజాంకు కప్పం కట్టేవారు. సర్ఫేఖాస్ పేరిట పెద్ద మొత్తంలో భూమిని నిజాం తన సొంత భూమిగా ప్రకటించుకొన్నాడు. దీని మీద వచ్చే ఆదాయం రాజు భోగభాగ్యాలకే తప్ప సంస్థానం అభివృద్ధికి కాదు. భారత ప్రభుత్వంలో కలవక స్వతంత్ర ఉస్మానిస్థాన్‌గా తన రాజ్యాన్ని (1947 జూలై 14) ప్రకటించుకొన్నాడు. అప్పటి నుంచి సంస్థానంలో అకృత్యాలు పెరిగిపోయాయి. 1929లో ఏర్పడ్డ మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అనే రజాకార్ల సంస్థ సంస్థానంలో అకృత్యాలకు తెరతీసింది. అది నిజాం స్వచ్ఛంద సైన్యంగా పనిచేసింది. మరోపక్క నిజాం నవాబు తెలంగాణను పాకిస్థాన్‌లో కలపడానికి సంధి రాయబారం నెరపాడు. ఇదే అదనుగా దేశవిభజన చేసిన మహమ్మద్ అలీ జిన్నా... నిజాంతో సమావేశమయ్యాడు. భారతదేశ భూభాగం మధ్యలో ఉండి, భారత ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా మారాలి అనుకున్నాడు. కానీ తెలంగాణ ప్రజలు, మేధావులు, కవులు, పాత్రికేయులు, రచయితలు, రైతులు, కూలీలు మొదలుకొని యక్షగాన కళాకారుల వరకు అందరూ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఇది జీర్ణించుకోలేని నిజాం నవాబు రజాకార్లను తెలంగాణపై వదిలేసి పరిపాలనను వారి చేతిలో పెట్టినంత పనిచేశాడు. ఖాసీం రజ్వీ మరో మహమ్మద్ అలీ జిన్నాలా తన అకృత్యాలను నిరాటంకంగా కొనసాగించడానికి మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరోక్షంగా తోడ్పడ్డాడు. తెలంగాణలో ఎన్నో గ్రామాలు రజాకార్ల హింసతో అట్టుడికిపోయాయి. గుండ్రాంపల్లి, అప్పంపల్లి, బైరాన్‌పల్లి, పరకాల మొదలైన ఎన్నో గ్రామాలు తీవ్రమైన రజాకార్ల హింసతో భీతిల్లిపోయాయి. నిజాం పోలీసుల పగటి పాలన, రజాకార్ల రాత్రి పాలన ప్రజల్ని నానావిధాలుగా హింసించింది. ఈ అత్యాచారాల రక్తసిక్త చరిత్ర వేల పుటల్లో లభిస్తుంది. "ఓ నిజాము పిశాచమా!" అంటూ మహాకవి దాశరథి... నిజాం నిరంకుశత్వాన్ని ఎండగట్టాడు. "నైజాము సర్కరోడా! నాజీల మించినోడా!" అంటూ నల్లగొండ యాదగిరి పాట నిజాం నుంచి విముక్తికి ఊపిరిపోసింది. ఆర్యసమాజ్, హిందూ మహాసభ, జాతీయ కాంగ్రెస్, సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, సాయుధ రైతాంగ సమితి, గ్రంథాలయోద్యమం, ఆంధ్రమహాసభ... అన్నీ ప్రజల్లో చైతన్యాన్ని నిర్మాణం చేశాయి. భారత సైన్యం హైదరాబాద్ రాష్ట్రంలోకి ప్రవేశించక ముందే ఎరుపాలెంలో 70 మందిని, పరకాలలో 35 మందిని నిజాం సైన్యం చంపేసింది. బీబీనగర్‌లో మహిళలపై అత్యాచా రాలు, బతుకమ్మలాడే స్త్రీలను వివస్త్రలుగా చేసి రజాకార్లు, నిజాం పోలీసులు పైశాచికానందం పొందారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతంలోని అనేక నగరాల్లో, గ్రామాల్లో దోపిడీలు, దౌర్జన్యాలు, విధ్వంసాలు, మానభంగాలు, హత్యలు, సామూహిక దహనాలు జరిగాయి. నేనే సర్వాధికారిని అని ప్రకటించిన నిజాం నవాబు దురాగతాలను ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ దూతగా హైదరాబాద్‌లో ఉన్న కె.ఎం. మున్షీ కేంద్రానికి తెలియజేశాడు. ఆ సమాచారం ఆధారంగా సర్దార్ పటేల్ తీసుకున్న నిర్ణయంతో 1948 సెప్టెంబర్ 13న భారతసైన్యం పోలీసు చర్య పేరుతో హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించింది. ఇక లాభం లేదనుకుని, మున్షీ సలహాతో నిజాం తననూ, తనవాళ్లను కాపాడుకోవడానికి నిశ్చయించుకొని 1948 సెప్టెంబర్ 17న బేగంపేట విమానాశ్రయంలో పటేల్ ముందు తలవంచి సరెండరయ్యాడు. దీనినే నిజాం తలవంచిన రోజు అని చరిత్రలో చెప్పుకొంటాం! కొమురం భీం మొదలుకుని నారాయణరావు పవార్ వరకు తెలంగాణ కోసం, తెలంగాణ విమోచన కోసం చేసిన పోరాటం 1948 సెప్టెంబర్ 17న ఫలించి ఈ ప్రాంతం విమోచన చెంది స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. ముఖ్యంగా ఉక్కుమనిషి సర్దార్ పటేల్ నిప్పుకణంలా చూపిన ఆనాటి ధైర్యం తెలంగాణ ప్రజల గుండెల్లో ఎన్నడూ చెరిగిపోదు.

## గణనాథుడి సేవలో మాజీ కార్పొరేటర్ స్వప్న సుందర్‌రెడ్డి

### సింగరేణి కాలనీలో అన్నదాన ప్రసాదం పంపిణీ



సైదాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 18: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐ.ఎస్.సదన్ డివిజన్‌లోని సింగరేణి కాలనీ మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని 38వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గణేష్ ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రజలంతా ఉత్సవాల్లో సోదరభావంతో పాల్గొనాలని స్వప్న సుందర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, కాలనీ



అసోసియేషన్ సభ్యులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

### అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్..

నల్గొండ, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 18: తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో త్వరలో నిర్వహించనున్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో పోటీ పడుతున్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు నల్గొండ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన 500 మంది నిరుద్యోగ యువతి, యువకులను ఎంపిక చేసి, నల్లగొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో వారికి ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అభ్యర్థులకు పోలీస్ నియామక పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమైన శారీరక దారుఢ్య శిక్షణ (ఫిజికల్ ట్రైనింగ్), రాత పరీక్షకు సంబంధించిన సిలబస్‌పై బోధన, మాక్ టెస్టులు, పరీక్షా విధానంపై అవగాహన, నిపుణుల మార్గదర్శకత్వం తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే ఎంపికైన అభ్యర్థులకు వసతి, భోజన సౌకర్యాలను కూడా ఉచితంగా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన శిక్షకులు, నిపుణుల ఆధ్వర్యంలో అభ్యర్థులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందిస్తూ, రాత పరీక్షతో పాటు ఫిజికల్ ఈవెంట్లలో కూడా మెరుగైన ప్రతిభ కనబరిచేలా అభ్యర్థులను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలనుకునే అభ్యర్థులు కింది గూగుల్ ఫామ్ లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు అలాగే ఎస్ఐ/కానిస్టేబుల్ నియామక ప్రక్రియకు దరఖాస్తు చేసుకున్న పార్ట్ 1, అప్లికేషన్ ఫామ్ ప్రతిని వెంట తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు తేది 20-09-2026 ఆదివారం ఉదయం 9.00 గంటలకు ముందుగానే క్రింది కేంద్రాల్లో సంబంధిత సబ్ డివిజన్ అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకుని, స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలనీ జిల్లా ఎస్పీ సూచించారు. × నల్లగొండ సబ్ డివిజన్ అభ్యర్థులు: ఎన్.జి. కళాశాల, నల్లగొండ× మిర్యాలగూడ సబ్ డివిజన్ అభ్యర్థులు: మీనా ఇంజినీరింగ్ కళాశాల, మిర్యాలగూడ× దేవరకొండ సబ్ డివిజన్ అభ్యర్థులు: కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మీనాక్షి సెంటర్స్, డిండి క్రాస్




రోడ్‌నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ అందిస్తున్న ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగం సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆకాంక్షించారు.

## సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జన సందడి

### భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికిన భక్తులు

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 18: వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వినాయక నిమజ్జనాలతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువకులు రాహుల్ కిషోర్ యాదవ్, ప్రమోద్ ముదిరాజ్, పెద్ది యాదవ్, పునీత్ కిషోర్ యాదవ్ తదితరులు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భక్తులు భక్తిగీతాలు, నినాదాలతో ఉత్సాహంగా పాల్గొనగా, సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ప్రశాంత



వాతావరణంలో ఉత్సవాలను ముగించేందుకు నిర్వాహకులు, భక్తులు సహకరించారు.

## చట్టాలపై అవగాహన సదస్సు

నల్లగొండ, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 18: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హిమబిందు విద్యార్థులకు చట్టాలపై



అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తాహెరా ఇఫ్ఫత్, సీనియర్ ఉపాధ్యాయురాలు శ్రీ వాణి దేవి, సూపరింటెంట్ స్వర్ణలత, కోర్టు సిబ్బంది ప్రభాకర్, పి ఎల్ వి పగడాల నాగయ్య, పాఠశాల ఉపాధ్యాయినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 248 డివిజన్‌లో బీజేపీ, ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జెండా పండుగ

శేర్లింగంపల్లి, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 18: శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని 248 డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బస్తీ దవాఖానా సమీపంలో జరిగిన కార్యక్రమంలో 248 డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బాలు యాదవ్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భూపాల్ రెడ్డి, గంగుల రాజిరెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్



యాదవ్, శివకుమార్, బీజేవైఎం అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, ఓబీసీ నాయకులు లోకేష్, రామరాజు, ఓబీసీ ఉపాధ్యక్షుడు నాగరాజు, పటేల్ ప్రభాకర్, పటేల్ ప్రతాపరెడ్డి, సంధ్యారాణి, రజినితో పాటు బీజేపీ, ఓబీసీ మోర్చా, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రాపోలు రిత్విక్ ప్రజాపతి జన్మదిన వేడుకలు

### కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు

సైదాబాద్, జ్యోతి ప్రభంజనం,, సెప్టెంబర్ 18: ప్రముఖ ఆర్‌టీఐ కార్యకర్త, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, 'జ్యోతి ప్రభంజనం' తెలుగు దినపత్రిక సంపాదకులు రాపోలు లింగస్వామి చిన్న కుమారుడు రాపోలు రిత్విక్ ప్రజాపతి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం వారి నివాసంలో కుటుంబ సభ్యుల సమక్షంలో రిత్విక్ ప్రజాపతి కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు



రిత్విక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రభంజనం పత్రిక సంపాదకులు రాపోలు లింగస్వామి ప్రజాపతి మాట్లాడుతూ తన చిన్న కుమారుడు రిత్విక్ ప్రజాపతి జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. చిన్ననాటి నుంచే మంచి విలువలు, క్రమశిక్షణ, మానవతా దృక్పథంతో ఎదిగి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రిత్విక్ ప్రజాపతి జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో రాపోలు కార్తీక్, ప్రజాపతి, రాపోలు రేణుక, సిలువేరు గీత, సుమ, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలను సందర్శించిన ముద్దు లచ్చి రెడ్డి

బి.ఎన్.రెడ్డి నగర్,జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి,సెప్టెంబర్ 18:పార్వతీ పరమేశ్వరుల పుత్రుడు, బుద్ధికి అధిపతి అయిన గణనాథుడు ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని తాజా మాజీ కార్పొరేటర్ ముద్దు లచ్చి రెడ్డి ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు, నిమజ్జన వేడుకల సందర్భంగా బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాలను ఆయన సందర్శించారు. సాహెబ్‌నగర్‌లోని ఆర్యభట్ట స్కూల్, ఎన్‌జీవోస్ కాలనీ బస్‌స్టేషన్, విజయపురి కాలనీ, బి.ఎన్.రెడ్డి నగర్ ఫేజ్-1, గౌతమి నగర్ కాలనీలలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో విజయవంతంగా నిర్వహించిన యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులను



అభినందించారు. అనంతరం వివిధ వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీధర్ రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, పార్టీ నాయకులు సుధీర్ కుమార్, రాజేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్.. ఇదేమి కంపు..!

- దుర్వాసనతో మరుగుదొడ్లు
- వాష్ రూమ్స్ సరిగ్గా లేక ఇబ్బందులు
- జల సమస్య తాకిడి..శాశ్వత పరిష్కారం అయ్యేనా?
- వైద్యశాల వార్డుల్లో కుక్కల సంచారం
- పారిశుద్ధ్యన్ని మరింత మెరుగుపరచాలి
- సౌకర్యాలతో పాటుగా వైద్యులను నియమించాలి



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ఈ పెద్ద ఆసుపత్రి మరుగుదొడ్లు చూస్తే.. కొత్త జబ్బు గ్యారెంటీగా వస్తుందని పలువురు సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆరోపించడం విమర్శలకు తావిస్తుంది. ఉన్న రోగాన్ని తగ్గించుకునేందుకు ఆసుపత్రికి వస్తే.. కొత్త రోగం అంటుకునే వాతావరణం కనిపిస్తుందని ప్రజలకు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక దిక్కు ప్రభుత్వం వైద్య సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెబుతున్న.. ఇక్కడ మాత్రం జిల్లా పెద్ద ఆసుపత్రికి సమస్యల తాకిడి ఎక్కువైంది. ఆస్పత్రిలో పారిశుద్ధ్య విభాగంపై.. సరైన పర్యవేక్షణ లేని కారణంగానే మరుగుదొడ్లు అధ్వానంగా కనిపించడంతోపాటుగా.. ఇతర సమస్యలతో పేషెంట్లు సందర్శకులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ దవాఖాన సమస్యల వలయంగా మారింది. బయట నుంచి చూస్తే అందంగా కనిపిస్తున్నా లోపల మాత్రం వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నది. దీంతో రోగులతోపాటు పేషెంట్లతో ఉండే వారు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఈ ధర్మాస్పత్రికి నీళ్ల కొరత తీవ్రంగా ఉంది. అయితే ఈ సమస్యను కేవలం తాత్కాలిక పరిష్కారం చూపే చర్యలు చేపట్టకుండా శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సందర్శకులు డిమాండ్ చేస్తున్నారు. నీటి వసతి సక్రమంగా లేక ఆసుపత్రిలో ఉండే మరుగుదొడ్లు గబ్బు కొడుతున్నాయి. నీటి కొరత కారణంగా అనేకమంది బయట నుండి నీళ్లను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. లూజ్ వాటర్ తో లీటర్ కు ఐదు రూపాయలు వసూలు చేయడంతో ఆర్థిక భారం పడుతుంది. ఇదిలా ఉంటే ఆస్పత్రిలో ఎక్కడ పడితే అక్కడ కుక్కలు సంచరిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ కుక్కలు ఆవరణలో అటు ఇటు తిరుగుతుండడం వల్ల వైద్య సిబ్బందికి సందర్శకులకు అసౌకర్యంగా మారింది. పెద్ద ఆస్పత్రిలో ప్రధాన సమస్యలను పాలకులు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# గణనాథుడి సేవలో భక్తి.. అన్నదానంతో మానవత్వం

**గణేష్ నుని వద్ద భక్తులకు అన్నదానం చేసిన కోట కుటుంబ సభ్యులు**

జ్యోతి ప్రభంజనం, హైదరాబాద్,ప్రతినిధి, సెప్టెంబర్ 18:వినాయక



నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గణనాథుడి సేవలో భాగంగా జుమ్మరత్ బజార్, దేవి నగర్, ఉప్పలమ్మ టెంపుల్, హైదరాబాద్ ప్రాంతంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గణేష్ నుని వద్ద నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కోట రవి, కోట వైష్ణవి, కోట శివ, కోట మహేష్, కోట రాజేశ్వరి భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాల్లో పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తుల్లో సేవాభావం మరింత పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి, ప్రతి ఒక్కరికీ ప్రేమాభిమానాలతో అన్నప్రసాదాన్ని అందించారు. అన్నదాన కార్యక్రమానికి హాజరైన భక్తులు నిర్వాహకులను అభినందిస్తూ, గణనాథుడి ఉత్సవాలను భక్తితో జరుపుకోవడంతో పాటు సమాజ



సేవకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మికతతో పాటు అన్నదానం మహాదానం అనే సేవా స్ఫూర్తిని చాటుతూ విజయవంతంగా కొనసాగింది. కార్యక్రమంలో స్థానిక భక్తులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సర్ హియరింగ్ వేగవంతం చేయాలి

**- ఓటర్ల ధృవపత్రాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలి**
**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):సర్ ప్రక్రియలో ఓటు కోల్పోయిన ఓటర్లకు నోటీసులు స్వీకరిస్తున్న హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కొత్తగూడెం తాహసిల్దార్ కార్యాలయంను ఆకస్మికంగా సందర్శించి హియరింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈనెల 22వ తేదీ ఈ హియరింగ్ ప్రక్రియకు చివరి గడువు కావున వేగవంతం పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని తాహసిల్దార్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేసిన కొత్తగూడెం మండలంలోని పీఎంశ్రీ పథకంలో కొనసాగుతున్న కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సందర్శించారు. పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తుండగా ఆరవ తరగతిలో ఇంగ్లీష్ సబ్జెక్టు పై పాఠ్యాంశాల్లో ప్రావీణ్యం ఏ విధంగా ఉంది అని విద్యార్థులతో చదివించి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రణాళిక బద్ధంగా క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఇంగ్లీష్ తోపాటు అన్నీ సబ్జెక్టులల్లో రాణిచేలా కృషి చేయాలని ఉపాధ్యాయుడు



హరిబాబుకు సూచించారు. అనంతరం పాఠశాలలో ఉన్న వంటశాలను పరిశీలించి 160 మంది విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలు కూర పప్పు అన్నం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న పథకంలో పౌష్టికాహారం అందిస్తుందని అవి విద్యార్థులకు అందేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాలు రాథోడ్ చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలకు త్రాగునీరు వసతులు ఏమున్నాయని ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథతో పాటు బయటనుంచి మినరల్ వాటర్ విద్యార్థుల త్రాగునీరు కోసం అందుబాటులో ఉంచామని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. అదేవిధంగా పాల్వంచ ఏరియా ఆసుపత్రి ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య కార్యక్రమాలు సకాలంలో రోగులకు అందించాలని అందిస్తున్న వైద్య సేవలను ఆసుపత్రి సూపరిడెంటెంట్ డాక్టర్ ముక్కటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న మెయిల్ వార్డు ఫిమేల్ వార్డు ఎమర్జెన్సీ వార్డు క్యాజువాలిటీ డయాలసిస్ సెంటర్ బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ఆపరేషన్ థియేటర్ లను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా ఐపీ విభాగంలో రికార్డులను



పరిశీలించి ఈ రోజు ఎన్ని జ్వరాల కేసులు నమోదయాయని అడిగి తెలుసుకున్నారు. 17 జ్వరాలు నమోదైన రోగులకు అడ్మిట్ చేసుకొని చికిత్స అందిస్తున్నటట్లు జిల్లా కలెక్టర్ కు సిబ్బంది తెలియజేశారు. ఆస్పత్రిలో వార్డుల్లో పరిశీలిస్తున్న నేపథ్యంలో ఒక బెడ్ పై ఇద్దరు రోగులు ఉండడానికి గమనించిన జిల్లా కలెక్టర్ వైద్య అధికారులను ఆరాతీశారు. ఆసుపత్రిలో 80 బెడ్లను ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని మరో 50 బెడ్లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ను సూపర్డెంటెంట్ కోరారు. అదేవిధంగా ఆస్పత్రిపై మరో అంతస్తు నిర్మాణానికి సహకరించాలని తెలిపారు. సంబంధిత ఇంజనీరింగ్ విభాగాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేస్తే పరిశీలిస్తానని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం పొందేలా భరోసా కల్పించేలా సేవలు విస్తృతం చేయాలని వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ క్రమంలో జూలూరుపాడు మండలానికి చెందిన కొంతమంది రోగి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఆవరణలో జిల్లా కలెక్టర్ తో స్వయంగా మాట్లాడారు. జూలూరుపాడు మండలంలో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పరిశీలిస్తానని పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని సూపరిడెంటెంట్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఆసుపత్రి ఆర్ఎంఓ సోమరాజు దొర, రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులను ఇంటి నుంచి గెంటేస్తున్న కొడుకుపై చర్యలు

**తీసుకోవాలి కోనేటి నాగమణి ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి**

కరీంనగర్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 18:కోతి రాంపూర్ లో నివాసం ఉంటున్న తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన కొడుకు వారిని ఇంటి నుంచి బయటకు వెళ్లిపొమ్మని వేధించడం అత్యంత బాధాకరమని, దేవులపల్లి లక్ష్మణ్?జయలక్ష్మి దంపతులకు తక్షణమే న్యాయం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తల్లింద్రులకు జరిగే విధంగా



తన కొడుకు పై చర్యలు తీసుకుని రిజిస్ట్రేషన్ తిరిగి దంపతులకు రిజిస్ట్రేషన్ చేసే విధంగా రెవెన్యూ అధికారులను చర్యలు చేపట్టే విధంగా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు తల్లిదండ్రులు తమ జీవితాలను పిల్లల భవిష్యత్తు కోసం త్యాగం చేస్తారని, వృద్ధాప్యంలో వారికి అండగా నిలవాల్సిన పిల్లలే వారిని నిర్లక్ష్యం చేయడం అమానవీయమని అన్నారు. దేవులపల్లి లక్ష్మణ్?జయలక్ష్మి దంపతులను వారి కొడుకు ఇంటి నుంచి గెంటివేశారని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వృద్ధ దంపతుల పరిస్థితిని అధికారులు వెంటనే పరిశీలించి, వారికి భద్రత, నివాసం, ఆర్థిక సహాయం కల్పించడంతో పాటు, వారికి చట్టపరంగా రావాల్సిన హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులను పోషించకుండా, నిర్లక్ష్యం చేసే పిల్లలపై తల్లిదండ్రులు మరియు వృద్ధ పౌరుల పోషణ, సంక్షేమ చట్టం?2007 ప్రకారం చర్యలు తీసుకునేలా అధికారులు చొరవ చూపాలని నాగమణి కోరారు. వృద్ధ తల్లిదండ్రులను రోడ్డున పడేసే పరిస్థితిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదు. దేవులపల్లి లక్ష్మణ్?జయలక్ష్మి దంపతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన ఐద్వా అండగా నిలుస్తుంది అని కోనేటి నాగమణి స్పష్టం చేశారు. ఈ జిల్లా నాయకురాలు ఉప్పునూటి లక్ష్మి కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి చేనిరోజా కారుపాకలమ్మ మున్నా తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్‌లో చెన్నై షాపింగ్ మాల్

# ఎగ్జిబిషన్ అండ్ సేల్ ప్రారంభం

### బీడీ రెడ్డి గార్డెన్‌లో హైదరాబాద్ అతిపెద్ద ఎగ్జిబిషన్ అండ్ సేల్‌కు విశేష స్పందన
### ముఖ్య అతిథిగా హాజరైన హీరోయిన్ హెపా పటేల్

జ్యోతి ప్రభంజనం, ఎల్‌బీనగర్, ప్రతినిధి, సెప్టెంబర్ 18:ఎల్‌బీనగర్ బీఎన్‌రెడ్డి నగర్‌లోని బీడీ రెడ్డి గార్డెన్‌లో చెన్నై షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ అతిపెద్ద ఎగ్జిబిషన్ అండ్ సేల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ హీరోయిన్ హెపా పటేల్ హాజరై, నిర్వాహకులతో కలిసి ఎగ్జిబిషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హీరోయిన్ హెపా పటేల్ మాట్లాడుతూ హైదరాబాద్ నగర ప్రజలకు, ముఖ్యంగా ఎల్‌బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఒకే వేదికపై వివిధ రకాల వస్త్రాలు, ఫ్యాషన్ కలెక్షన్లు, ఆకర్షణీయమైన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. చెన్నై షాపింగ్ మాల్ నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకమైన, విభిన్నమైన కలెక్షన్లు అందుబాటులో ఉండటం విశేషమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 18 నుంచి 27వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ అండ్ సేల్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేరే ఎక్కడ కనిపించని అరుదైన డిజైన్‌లు, ఇంకెవ్వరు ఇవ్వలేని భారీ తగ్గింపు ధరలలో ఉన్నాయని, ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ప్రారంభోత్సవం అనంతరం హీరోయిన్ హెపా పటేల్ ఎగ్జిబిషన్‌లోని వివిధ స్టాళ్లను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న పలు రకాల కలెక్షన్లను పరిశీలించారు. మహిళలు, పురుషులు, పిల్లల కోసం అందుబాటులో ఉంచిన వివిధ రకాల వస్త్రాలు, ఫ్యాషన్ ఉత్పత్తులు, ప్రత్యేక కలెక్షన్లను ఆమె ఆసక్తిగా పరిశీలించారు. పది రోజుల పాటు ప్రత్యేక సేల్‌చెన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్ అండ్ సేల్‌లో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా విభిన్న రకాల కలెక్షన్లను అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. నాణ్యతతో పాటు ఆకర్షణీయమైన ధరల్లో ఉత్పత్తులను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పండుగలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకలు, రోజువారీ వినియోగానికి అనుగుణంగా వివిధ రకాల ఫ్యాషన్ కలెక్షన్లు ఒకే చోట లభించడం ఈ ఎగ్జిబిషన్ ప్రత్యేకతగా నిర్వాహకులు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వినియోగదారులు ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమకు నచ్చిన ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుంచి 27 వరకు బీఎన్‌రెడ్డి నగర్ బీడీ రెడ్డి గార్డెన్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో చెన్నై షాపింగ్ మాల్ నిర్వాహకులు వెంకట్రావు, కృష్ణారావు సిబ్బంది, స్థానిక ప్రముఖులు, అభిమానులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.







# బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా..

### జియాగూడ నుండి శంషాబాద్‌కు తీన్మార్ మల్లన్న అడుగులు
### తెలంగాణలో మొదలైన బీసీ రాజ్యాధికార పోరు..
### రెండో రోజుకు చేరిన మల్లన్న పాదయాత్ర
### కేసీఆర్ పట్టించుకోలేదు.. రేవంత్ పరిష్కరించట్లేదు'.. మల్లన్న ముందు జీహెచ్ ఎంసి కార్మికుల గోడు.!
### జీహెచ్ ఎంసి కార్మికుల శ్రమ దోపిడీపై తీన్మార్ మల్లన్న నిప్పులు.. 'ఆ ఏజెన్సీల అంతు చూస్తా'.!
### జియాగూడ టు శంషాబాద్: హోరెత్తిన తీన్మార్ మల్లన్న 'బీసీ రాజ్యాధికార యాత్ర'

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన 'బీసీ రాజ్యాధికార యాత్ర' రెండో రోజు విజయవంతంగా ముగిసింది. పాదయాత్ర జియాగూడ నుంచి ప్రారంభమై శంషాబాద్ లో ముగిసిందిజియాగూడ నుంచి మొదలైన ఈ యాత్ర ఆరాంఘర్, గగన్‌పహాడ్ మీదుగా శంషాబాద్ వరకు కొనసాగింది. రెండో రోజు పాదయాత్రలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తలతో పాటు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తీన్మార్ మల్లన్నతో కలిసి అడుగులు వేస్తూ, ఆయనకు మద్దతుగా నినాదాలు చేస్తూ యాత్రకు సంఘీభావం ప్రకటించారు. పాదయాత్ర పొడవునా రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారస్తులను, స్థానిక ప్రజలను మల్లన్న ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం యొక్క ఆవశ్యకతను వారికి వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పాదయాత్రలో భాగంగా జీహెచ్ ఎం సీ కార్మికులు తీన్మార్ మల్లన్నను కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. ప్రస్తుతం ఉన్న ఏజెన్సీ వ్యవస్థల వల్ల తమ శ్రమ దోపిడీకి గురవుతోందని, రాత్రింబగళ్లు కష్టపడుతున్నా పనికి తగిన వేతనం అందడం లేదని మల్లన్న ఎదుట కన్నీరు పెట్టారు. తక్షణమే ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం కానీ, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కానీ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోయారు. కార్మికుల కష్టాలను విన్న తీన్మార్ మల్లన్న వారి పక్షాన నిలబడుతానని,ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయించే పూచి తనదని వారికి పూర్తి భరోసా ఇచ్చారు. మీ శ్రమను దోచుకుంటున్న ఏజెన్సీ వ్యవస్థ రద్దు అయ్యే వరకు మీ తరఫున నేను పోరాడుతాను, మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని మల్లన్న కార్మికులకు



హామీ ఇచ్చారు. అలాగే మూడో రోజు ఉదయం 8:00 గంటలకు శంషాబాద్ నుండి బయలుదేరి పాలమాకుల, తిమ్మాపూర్ మీదుగా యాత్ర సాగనుంది. కొత్తూరు, నందిగామ మండల ప్రధాన కూడళ్లలో బహిరంగ కార్నర్ మీటింగ్స్ ఉండనున్నాయి. శనివారం రాత్రికి నందిగామలోనే మల్లన్న బస చేయనున్నారు.

# హమారా ప్రసాద్ ను

# శాశ్వతంగా జైల్లోనే ఉంచాలి

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అవమానపరిచిన హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షిస్తూ శాశ్వతంగా జైల్లోనే ఉంచాలనిపలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో గలఅంబేద్కర్ విగ్రహం వద్దభారతరత్న అంబేద్కర్ సంక్షేమసంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులుఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో హమారా ప్రసాద్(ఆవారా ప్రసాద్) అరెస్టుపై హర్షాతిరేకాలతోస్పందిస్తూ శుక్రవారంస్వీట్లు పంపిణీ చేసుకొని ఒకరి కొకరు సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తలు మాట్లాడుతూ భవిష్యత్తులో మత కుల విద్వేషక చర్యలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రతిష్టను భారత రాజ్యాంగాన్ని అప్రతిష్ట పాలు కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. తొలుత భారతరత్న అంబేద్కర్ చిత్రపటానికి ముఖ్య అతిథులుఅందరూ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయాలసాధన కోసం కృషి చేయాలిఅనే నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పాల్వంచల కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జే బి శౌరి, జై భారత్ భీమ్రావు పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా కామేష్, అభ్యుదయ వాది సామాజిక వాది అంబేద్కర్ పూలే వాది టీజేఎస్ నాయకులు మల్లెల రామనాథం,దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్, టి ఈ ఏ ఎం రాష్ట్ర కన్వీనర్ దాసరి రమేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కురిమెళ్ళ శంకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంతోటి పాల్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దాల మహేష్, ఏఐవైఎఫ్‌జిల్లా నాయకులు జర్పుల ఉపేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తిని రాజశేఖర్, యూత్ కాంగ్రెస్ అంబేద్కర్ సంఘ నాయకులు ఎం.పురుషోత్తం, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాళ్లు మునీల రాజ్, బడికల పుష్పలత, బద్దం స్వర్ణలత,సామాజిక అభ్యుదయవాదులు, వివిధ



సంఘాల నాయకులు, అంబేద్కర్ సంఘ రాష్ట్ర మైనార్టీ నాయకులు సల్మాన్ ఖాన్ తోత, అంబేద్కర్ సంఘ జిల్లా నాయకులు రాజేశ్వరరావు, శెట్టి కమలాకర్, అంబేద్కర్ సంఘ నాయకులుసూరం వరప్రసాద్, రామిళ్ళ మధుబాబు, ఇల్లంగి తిరుపతి, అంతటి రాజు, టి.సువర్ణ బాబు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జ్ వి.అనిల్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు మద్దెల ఆదర్శ్, ప్రధాన కార్యదర్శి కేదాసి కిరణ్, వంశీ, రమేష్, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ కల్పిత నాయకుడు అంటూ ఆర్ఎస్ఎస్

# ముసుగులో సాగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించాలి

### పాలడుగు నాగార్జున.కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు.

నల్లగొండలో పెద్ద ఎత్తున నిరసన ? దుష్ప్రచారానికి పాల్పడుతున్న పంది ప్రసాద్‌ను వెంటనే కఠినంగా శిక్షించాలి. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తూ, ఆయన కల్పిత నాయకుడు అంటూ ఆర్ఎస్ఎస్ ముసుగులో సాగుతున్న దుష్ప్రచా రాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున తెలిపారు. అంబేద్కర్‌ను కల్పిత నాయకుడు అంటూ పుస్తకం విడుదల చేస్తానని ప్రచారం చేస్తున్న పంది ప్రసాద్‌పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని, దుష్ప్రచారాన్ని నిలిపివేయాలని, సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి (ఆఇూ) కార్యాలయం ముందు ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), మాల మహానాడు, మరియు వివిధ సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, దుష్ప్రచారానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేద్కర్‌ను అవమానిస్తే సహించేది లేదుఈ సందర్భంగా పాలడుగు నాగార్జున అద్దంకి రవీందర్ తెలగమల యాదగిరి యనమల అనిల్ గాదే నరసింహ మాట్లాడుతూ...డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి కాదని, కోట్లాది అణగారిన ప్రజలకు ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం అందించిన మహనీయుడని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పోషించిన చారిత్రక పాత్రను వక్రీకరించి, ఆయనను కల్పిత నాయకుడిగా చిత్రీకరించడం రాజ్యాంగ విలువలను అవమానించడమేనని పేర్కొన్నారు. కుల వివక్ష, అంటరానితనం, అసమానతలకు వ్యతిరేకంగా అంబేద్కర్ సాగించిన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, మహిళల హక్కులు, దళితులు, ఆదివాసీల హక్కుల కోసం అంబేద్కర్ చేసిన కృషిని ఎవరూ చెరిపివేయలేరని తెలిపారు. అంబేద్కర్‌ను అవమానించేలా పుస్తకాలు విడుదల చేస్తామని, దుష్ప్రచారం చేస్తామని ప్రకటించడం సామాజిక సామరస్యా నికి భంగం కలిగించే చర్యలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలపై ప్రభుత్వం, పోలీసులు కఠినంగా స్పందించాలని కోరారు. ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలాన్ని తిప్పికొట్టాలిఅంబేద్కర్ ఆలోచనలకు వ్యతిరేకంగా, కుల వివక్షను సమర్థించే మనువాద భావజాలాన్ని ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని నాగార్జున పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం కల్పించిందని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అంబేద్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని అవమానించడమేనని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను కాపాడుకునేందుకు ప్రజాసంఘాలు, దళితులు, బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రధాన డిమాండ్లు1. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను కల్పిత నాయకుడిగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్న పంది ప్రసాద్‌పై వెంటనే కేసు నమోదు చేసి, చట్టప్రకారం అరెస్టు చేయాలి. 2. అంబేద్కర్‌ను అవమానించే పుస్తకాన్ని విడుదల చేయాలనే ప్రయత్నాన్ని చట్టపరంగా పరిశీలించి, నేరం రుజువైతే కఠినంగా శిక్షించాలి. 3. పంది ప్రసాద్ బహిరంగంగా సమాజానికి క్షమాపణ చెప్పాలి. అంబేద్కర్‌పై చేసిన అవమానకర వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి. 4. అంబేద్కర్‌పై దుష్ప్రచారం, అవమానకర వ్యాఖ్యలు, సామాజిక విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలు



పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలి. 5. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చారిత్రక పాత్రను వక్రీకరించే ప్రయత్నాలను అడ్డుకోవాలి. 6. అంబేద్కర్ విగ్రహాలు, చిత్రాలు, రాజ్యాంగ ప్రతుల అవమానానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. 7. పాఠశాలలు, కళాశాలల్లో అంబేద్కర్ జీవితం, రాజ్యాంగ విలువలు, సామాజిక సమానత్వంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. 8. కుల వివక్ష, అంటరానితనం, మనువాద భావజాలానికి వ్యతిరేకంగా ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. 9. అంబేద్కర్ ఆశయాల పరిరక్షణకు సామాజిక ప్రజాసంఘాలతో ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి సూచనలు తీసుకోవాలి. 10. రాజ్యాంగ హక్కులు, దళితులు, ఆదివాసీలు, గిరిజన బహుజనుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం స్పష్టమైన చర్యలు ప్రకటించాలి. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులుఈ నిరసన కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు అద్దంకి రవీందర్, తెలగమల్ల యాదగిరి, రేఖల సైదులు ఏన్నమల్ల అనిల్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గాదె నరసింహ, బొల్లు రవీంద్రకుమార్, గీత కార్మిక సంఘం నాయకులు కొండా వెంకన్న, పోలీ సత్యనారాయణ చందా యాదగిరి శ్రావణ్ కుమార్ నరేందర్ లక్ష్మణ్ భారత్ కుమార్ శ్రీనివాస్ ప్రసాద్ చరణ్ తేజ్ పవన్ కుమార్ సాయి వరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని, ఆర్ఎస్ఎస్ ముసుగులో సాగుతున్న మనువాద భావజాలాన్ని తిప్పికొడతామని హెచ్చరించారు. అంబేద్కర్ ఆశయాల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యవాదులు, సామాజిక ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), నల్లగొండ జిల్లా ప్రెస్‌నోట్‌కు మరింత బలం చేకూర్చే ముఖ్యమైన డిమాండ్‌పుస్తకం విడుదల చేయనున్నట్లు ప్రచారం చేసిన వ్యక్తిపై పూర్తి విచారణ జరిపి, ఆ పుస్తకంలోని విషయాలను పరిశీలించి, చట్టవిరుద్ధమైన లేదా అవమానకరమైన అంశాలు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలి.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**